# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 07 ఫిబ్రవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## పీఈసెట్, ఎడ్‌సెట్ షెడ్యూల్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ పీఈసెట్ షెడ్యూల్, ఎడ్‌సెట్ షెడ్యూల్ గురువారం విడుదలయ్యాయి. పీఈ సెట్ నోటిఫికేషన్ మార్చి 12న విడుదల కానున్నది. మార్చి 15 నుంచి మే 24 వరకు పీఈ సెట్ దరఖాస్తులు స్వీకరించనున్నారు. అపరాధ రుసుముతో మే 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. ఇక జూన్ 11 నుంచి 14 వరకు పీఈ సెట్ పరీక్షలు జరుగుతాయని పేర్కొంది.

ఇక తెలంగాణ ఉన్నత విద్యామండలి గురువారం ఎడ్‌సెట్ షెడ్యూల్‌ను సైతం విడుదల చేసింది. మార్చి 10న ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదలవుతుందని పేర్కొంది. మార్చి 12 నుంచి మే 13 వరకు ఎడ్‌సెట్ దరఖాస్తుల స్వీకరించనున్నట్లు తెలిపింది. జూన్ 1న ఉదయం, మధ్యాహ్నం సెషన్‌లో ఎడ్‌సెట్ పరీక్ష జరుగుతుందని పేర్కొంది.



## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

- ఏకగ్రీవ విజయాల్లో ఎమ్మెల్యేలే బాధ్యత తీసుకోవాలి
- బేధాభిప్రాయాలను పక్కనపెడదాం
- కొత్త, పాత నేతలు సమన్వయంతో వ్యవహరించాలి
- ఎస్సీ వర్గీకరణపై ఉమ్మడి నల్లగొండలో భారీ బహిరంగ సభ
- కులగణనపై ఉత్తర తెలంగాణలో మరో సభ
- కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశం

**బలగం టీవి, హైదరాబాద్**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్డీలో జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ఎమ్మెల్యేలు పూర్తి స్థాయిలో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో కాంగ్రెస్ బలాన్ని పెంపొందించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో ఏకగ్రీవ విజయం సాధించే బాధ్యత ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు నిదర్శనంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, ఆలయాల అభివృద్ధి, వివిధ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడం, నిధుల కేటాయింపు కోసం తక్షణమే సంబంధిత మంత్రులను కలవాలని సూచించారు. స్థానిక సంస్థల పదవుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఇది పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉండేలా, బీసీ వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు. బీసీ నాయకత్వాన్ని ముందుకు తేవడానికి, వారికి అధికారంలో మద్దతుగా నిలిచేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని సీఎం పేర్కొన్నారు.

ఈ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కొత్త, పాత నేతలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పార్టీ నేతలు, క్యాడర్ అందరూ ఒకే తాటిపై నిలిచి పనిచేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల విజయమే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో మరింత దృఢంగా నిలిచేలా చేస్తుందని, అందుకే ప్రతి నియోజకవర్గం స్థాయిలో సమర్థవంతమైన ఎన్నికల ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రజలకు చేరువగా ఉంటూ ప్రభుత్వ పథకాలను గట్టిగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యేలకు సూచించారు.

ఇటీవల పార్టీ లైన్ దాటుతున్న నేతల అంశంపై సీఎల్పీ సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. ఎవరైనా కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలను వ్యతిరేకిస్తే కఠినంగా వ్యవహరించాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పార్టీ విధానాలపై ఎవరికైనా అనుమానాలు ఉంటే.. అంతర్గతంగా చర్చించాలని కాంగ్రెస్ సీనియర్ నేతలు సూచించినట్లు తెలుస్తోంది. బీసీ కులగణనతో పాటు ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ సర్కారు తీసుకున్న నిర్ణయాలపై రెండు బహిరంగ సభలు పెట్టాలని నిర్ణయించారు. ఈ సభలకు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలను ఆహ్వానించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

> సీఎల్పీ సమావేశానికి కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరంగా ఉన్నారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావు, గూడెం మహిపాల్ రెడ్డి, కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, సంజయ్‌కుమార్, కృష్ణమోహన్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరు కాలేదు. వారికి అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేయడం, కేసు సుప్రీంకోర్టులో ఉండటంతో టెక్నికల్‌గా ఏ సమస్యా రాకుండా, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వారు ఈ సమావేశానికి గైర్హాజరైనట్టు తెలిసింది. కాగా 56 మంది ఎమ్మెల్యేలు, తొమ్మిది మంది ఎమ్మెల్సీలు భేటీకి హాజరయ్యారు.

సీఎల్పీ భేటీ ముగిసిన అనంతరం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఫిబ్రవరిలో రెండు భారీ బహిరంగ సభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సభలకు కాంగ్రెస్ హైకమాండ్ నేతలను ఆహ్వానించేందుకు ఢిల్లీ వెళుతున్నామని తెలిపారు. ఇక, ఎమ్మెల్యేలు విందు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడంలో తప్పేమీ లేదని అన్నారు. బీసీ జనాభాపై బీఆర్ఎస్ వాస్తవాలు తెలియక తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. బీసీ సంఘాలను ఆపార్టీ తప్పుదోవ పట్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులగణనపై రాహుల్‌గాంధీతో సూర్యాపేటలో బహిరంగ సభ, ఎస్సీ వర్గీకరణపై మెదక్‌లో ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గేతో మరోసభను నిర్వహిస్తామన్నారు. బీజేపీతో మాజీ మంత్రి కేటీఆర్ లోపాయకారి ఒప్పందం చేసుకునేందుకు ఢిల్లీకి పోతున్నారని చెప్పారు. ఎమ్మెల్యేలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసినట్టు తెలిపారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొదటిసారిగా కులగణన చేపట్టామని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ ఆశయం మేరకు పరిపూర్ణంగా సర్వే చేసి ఎవరు ఎంత సంఖ్యలో ఉన్నారో తేల్చామన్నారు.తమ పార్టీకి సంబంధించి ప్రత్యేకంగా ఎమ్మెల్యేల సమావేశం జరగలేదనీ, వారు కలిసి డిన్నర్ చేస్తే తప్పేంటి? అని ప్రశ్నించారు. ఇతర సామాజిక తరగతులపై అనుచితంగా మాట్లాడిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. సమాధానం వచ్చాక చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని తెలిపారు. ఈ సమావేశం ద్వారా ఎమ్మెల్యేలకు ఉన్న అనుమానాలు నివత్తి చేశామన్నారు.

బీజేపీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకే కేటీఆర్ ఢిల్లీ వెళ్లారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించా మన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రెండు మూడు రోజుల్లో పీసీసీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

**ఢిల్లీకి బయలుదేరిన సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు**

బీసీ కులగణన, ఎస్సీ, వర్గీకరణ తదితరాంశాలపై సీఎల్పీలో చర్చించిన విషయాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుగా గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులు తదితరులు ఢిల్లీకి బయలుదేరారు. కొంత మంది ఎమ్మెల్యేలు కూడా వారివెంట ఉన్నారు.

## ఓబీసీ కోటా కలను నిజం చేశాం

- విభజించి పాలించడమే కాంగ్రెస్ విధానం
- సబ్ కా సాత్ సబ్ కా వికాస్ నినాదంతో బీజేపీ ప్రభుత్వం ముందుకు వెళుతోంది
- కుటుంబాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్ రాజకీయాలు
- ప్రధాని మోడీ
- పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ



**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఓబీసీ కోటాకు రాజ్యాంగ హెూదా కల్పించిందే బీజేపీ ప్రభుత్వమని ప్రధాని మోడీ అన్నారు. . దశాబ్దాల ఓబీసీ కోటా కలను నిజం చేశామన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రధాని మోదీ రాజ్యసభ లో గురువారం ప్రసంగించారు. ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీలను అభివృద్ధి చేశామన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి మిషన్ మోడ్ లో పనిచేస్తున్నామని, బీజేపీ పదేళ్ల పాలనలో నారీశక్తి ప్రతిబింబించిందన్నారు ప్రధాని మోదీ. నేషన్ ఫస్ట్ నినాదంతో ముందుకెళుతున్నాం..అదే ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ఫ్యామిలీ ఫస్ట్ స్లోగన్ ఇస్తుందన్నారు. ఎన్డీయే ప్రభుత్వ అభివృద్ధి నమూనాను ప్రజలు స్వాగతిస్తున్నారు.. ప్రజలు నమ్మారు కాబట్టే మూడు సార్లు అధికారం ఇచ్చారని ప్రధాని అన్నారు. కాంగ్రెస్ ఎప్పుడూ ఓట్లకోసమే పనిచేస్తుంది.. అందుకే కాంగ్రెస్ ఫ్యామిలీ పాలిటిక్స్ ను, తప్పుడు ప్రకటనలు జనం నమ్మడం లేదని చెప్పారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం స్ఫూర్తిదాయకంగా, ప్రభావవంతంగా ఉందన్నారు. అందరి భవిష్యత్తుకు మార్గదర్శకంగా ఉందన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగాన్ని ప్రశంసిస్తూ, అది దేశ ప్రజల భవిష్యత్‌కు మార్గదర్శకంగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. "భారతదేశ విజయాలు, ప్రపంచం నుంచి ఉన్న అంచనాలు, సాధారణ ప్రజల ఆత్మవిశ్వాసం, అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యంపై ప్రస్తావించిన రీతిలో రాష్ట్రపతి ప్రసంగం ప్రభావంతంగా, మార్గదర్శిగా ఉంది" అని మోదీ అన్నారు. "కాంగ్రెస్ పార్టీ పూర్తిగా ఒక్క కుటుంబం కోసం అంకితం అయిపోయింది. అందువల్ల 'సబ్కా సాథ్, సబ్కా వికాస్' భావన వారికి పనిచేయదు. కాంగ్రెస్ మోసపూరిత, అవినీతి, కుటుంబపారంపర్య రాజకీయాలను నమ్మింది. అందులో 'సబ్కా సాథ్, సబ్కా వికాస్' కి చోటు లేదు" అని మోదీ విమర్శించారు. కాంగ్రెస్ తమ కుటుంబాన్ని కాపాడుకోవడానికి మాత్రమే రాజకీయాలు చేస్తుందని మోదీ అన్నారు. అందుకే వారి విధానాలు, విధి విధానాలు కూడా కుటుంబాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా ఉంటాయన్నారు. 2014 తర్వాత దేశానికి ఒక ప్రత్యామ్నాయ పాలనా మోడల్ లభించింది. ఇది ప్రీతిపాత్రం రాజకీయాలు కాకుండా ప్రజల సంతృప్తిని దృష్టిలో ఉంచుకుని పనిచేస్తుందని మోదీ అన్నారు.

కుటుంబం ఫస్ట్ అనే మోడల్‌ను కాంగ్రెస్ అనుసరిస్తే, మేము ఎల్లప్పుడూ 'దేశం ఫస్ట్' అనే సిద్ధాంతంతో ముందుకు వెళ్ళామని మోదీ అన్నారు. ప్రజలు మమ్మల్ని దేశానికి మూడోసారి సేవ చేసే అవకాశం కల్పించారు. వారు మా పాలనను అంచనా వేసి, మేము ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చామని చూశారని మోదీ వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రభుత్వం అంబేద్కర్‌కు భారత రత్న ఇచ్చిందని.. కాంగ్రెస్ ఇన్నేళ్లు అధికారంలో ఉండి ఈ మాత్రం కూడా చేయలేదని మోదీ ఆరోపించారు. "కాంగ్రెస్‌కు అంబేద్కర్‌పై ద్వేషం ఉంది. ఆయనను రెండు సార్లు లోక్‌సభ ఎన్నికల్లో ఓడించేందుకు వారు అన్నీ ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు ప్రజల ఒత్తిడితో కాంగ్రెస్ నాయకులు 'జై భీమ్' నినాదం చేయాల్సి వస్తోంది, కానీ వారు అది హృదయపూర్వకంగా చెబుతున్నట్టు కనిపించదు" అని మోదీ వ్యాఖ్యానించారు. విభజించి పాలించడమే కాంగ్రెస్ విధానమన్నారు ప్రధాని మోదీ.. అయితే దేశాభివృద్ధి కోసం అందరిని కలుపుకుపోవడమే లక్ష్యంగా బీజేపీ పని చేస్తుందన్నారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ నినాదంతో బీజేపీ ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ ద్వేషించిందన్నారు. ఆయనకు భారతరత్న ఇచ్చేందుకు నిరాకరించిందన్నారు. కానీ ఇప్పుడు వారు బలవంతంగా జైభీమ్ అని పలుకుతున్నారని ఎద్దేవా చేశారు.

## మోడీ ఎందుకు మౌనం

- ఇప్పటికైనా స్పందించాలి
- పార్లమెంట్ ముందు ఆందోళన చేపట్టిన ప్రతిపక్షాలు




**బలగం టీవి, న్యూఢిల్లీ**

భారతీయుల తరలింపులో అమెరికా అమానవీయతపై ప్రధాని మోడీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. మౌనం వీడి స్పందించాలని, భారతీయుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేశాయి. భారతీయుల తరలింపులో అమెరికా అమానవీయంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ ఆందోళనకు దిగాయి. గురువారం పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు మకర ద్వారం ఎదురుగా ఇండియా బ్లాక్ పార్టీల ఎంపీలు చేతులకు బేడీలు వేసుకొని వినూత్న నిరసన తెలిపారు. కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ, ఎన్సీపీ, సీపీఐ(ఎం), సీపీఐ, ఆప్, ఆర్జేడీ, జెఎంఎం, నేషనల్ కాన్ఫరెన్స్, ఆర్ఎస్పీ, ఐయూఎంఎల్, వీసీకే, ఎండీఎంకే తదితర పార్టీల ఎంపీలు ఆందోళన చేపట్టారు. అమెరికా భారతీయులను స్వదేశానికి పంపిన తీరులో కేంద్ర వైఫల్యానికి వ్యతిరేకంగా ప్లకార్డులు చేబూని నినాదాలు హెూరెత్తించారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాది పార్టీ ఎంపీలు అఖిలేశ్ యాదవ్, ధర్మేంద్ర యాదవ్, సీపీఐ(ఎం) ఎంపీలు జాన్ బ్రిట్టాస్, కె.రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.


ఈ సందర్భంగా ప్రియాంక గాంధీ మాట్లాతుడూ విశ్వ గురువుగా చెప్పుకునే ప్రధాని మోడీ ఇప్పుడెందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. 'అమెరికా అధ్యక్షులు ట్రంప్, ప్రధాని మోడీ మంచి స్నేహితులంటారు. మరి ఇలాంటి సందర్భంలో ఎందుకు ట్రంప్‌తో మాట్లాడలేదు. మనవాళ్లను తీసుకురావడానికి ఒక విమానాన్ని కూడా పంపలేమా?. మనుషులతో ఇలాగే ప్రవర్తిస్తారా? ' అని ప్రశ్నించారు. దీనిపై విదేశాంగ శాఖ మంత్రి, ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశాన్ని విశ్వగురువుగా మార్చాలనే కలను చూపిస్తోన్న వారు ఇప్పుడెందుకు స్పందించడం లేదని అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు. దేశ పౌరులను బానిసల తరహాలో చేతులకు బేడీలు వేసి, అమానవీయ పరిస్థితుల్లో బహిష్కరించడం సరికాదన్నారు. ఈ పరిస్థితుల నుంచి పిల్లలను, మహిళలను రక్షించడానికి కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. మనవాళ్లను బహిష్కరిస్తున్నారని ముందుగానే తెలిసినప్పుడు, కేంద్ర సర్కార్ ఎందుకు స్పందించలేకపోయిందని కాంగ్రెస్ ఎంపీ గుర్జీత్ సింగ్ ఔజ్లా మండిపడ్డారు. అంతకు ముందు... అమెరికా నుంచి అమానవీయంగా భారతీయుల్ని బహిష్కరించడంపై చర్చకు పట్టుబడుతూ ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభలో వాయిదా తీర్మానం ఇచ్చారు.

భారతీయుల తరలింపులో అమెరికా పాల్పడిన అమానవీయతకు వ్యతిరేకంగా లోక్‌సభలో ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. గురువారం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే ప్రతిపక్షాలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టాయి. ప్రధాని మోడీ స్పందించాలని, భారతీయుల ఆత్మగౌరవాన్ని కాపాడాలంటూ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు హెూరెత్తించారు. దీంతో సభ వెంటనే మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో పరిస్థితిలో ఎటువంటి మార్పు రాకపోవడంతో సభను మధ్యాహ్నం 3.30 గంటలకు వాయిదా వేశారు. మళ్లీ తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగడంతో సభ నేటి (శుక్రవారం)కి వాయిదా పడింది. మరోవైపు రాజ్యసభ కూడా ఇదే తీరులో కొనసాగింది. రాజ్యసభ ప్రారంభమైన వెంటనే ప్రతిపక్షాల ఆందోళనతో మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన నేపథ్యంలో విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జైశంకర్ ప్రకటన చేశారు. అయితే ఈ ప్రకటనను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి.

**ఇది కొత్తేమీ కాద్ను : జై శంకర్**

అక్రమ వలసదారులను స్వదేశానికి పంపడం కొత్తేమి కాదని విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. ఇది ఆ దేశ ప్రామాణిక విధానమని అన్నారు. విమానంలో వారిని తిరిగి తీసుకువస్తున్న తరుణంలో వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించడం మాత్రం సరికాదని మంత్రి అభిప్రాయపడ్డారు. విదేశాల్లో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్టు తేలితే తమ పౌరులను తిరిగి తీసుకు రావడం అన్ని దేశాల ప్రాథమిక బాధ్యత అని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. అయితే ఇలా దేశం నుంచి వెనక్కి పంపుతున్న వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించకుండా ఉండాలని, అమెరికా అధికారులతో తాము సంప్రదింపులు జరుపుతున్నట్టు ఆయన తెలిపారు. ఇక బహిష్కరణకు గురైన వారు అందించిన సమాచారం ఆధారంగా ఏజెంట్లు, ఏజెన్సీలపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఈ అంశంపై అమెరికా ప్రభుత్వంతో చర్చిస్తున్నామన్నారు. ఇదే సమయంలో చట్టబద్ధమైన ప్రయాణికులకు వీసాలను సులభతరం చేయడంతోపాటు అక్రమ వలసదారులపై కఠిన చర్యలు తీసుకోవడం ఉండాలన్నారు. అయితే మహిళలు, చిన్న పిల్లలతో ఈ విధంగా వ్యవహరించడం లేదని తమకు సమాచారం అందిందని తెలిపారు.


## కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ భేటీ



**బలగం టీవి, న్యూఢిల్లీ**

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎల్పీ సమావేశం ముగిసిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. ఈ క్రమంలో కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కులగణన, ఎస్సీ వర్గీకరణ, పీసీసీ కార్యవర్గం కూర్పు వంటి ముఖ్యమైన అంశాలపై చర్చ జరిగినట్టు తెలిసింది. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీనియర్ నేత రాహుల్‌తో సీఎం రేవంత్ బృందం భేటీ కానుంది.

ఇదిలా కేసీ వేణుగోపాల్‌తో భేటీ అనంతరం.. సమావేశంలో చర్చించిన అంశాలను మీడియాకు వివరించారు డిప్యూటీ సీఎం భట్టి. కులాల గణనతోపాటు ఎస్సీ వర్గీకరణ, పీసీసీ కార్యవర్గం కూర్పు, మంత్రివర్గ విస్తరణ, స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించనున్నారు. రాహుల్ గాంధీ కోరిక మేరకే రాష్ట్రంలో కుల గణన చేపట్టామని చెప్పారు. రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వేలో దాదాపు లక్షలాది మంది సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కుల గణన సర్వే వివరాలను కెసి వేణుగోపాల్‌కు అందజేశామన్నారు. తెలంగాణలో కులగణన, ఎస్సీ వర్గీకరణపై త్వరలోనే భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామన్నారు. బహిరంగ సభలపై అధిష్టానంతో చర్చించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని పథకాలను పార్టీ పెద్దలకు వివరించాం అని తెలిపారు. కులగణన, ఎస్సీ వర్గీకరణపై తెలంగాణలో జరిగే బహిరంగ సభకు రాహుల్ ను ఆహ్వానించడంపై చర్చించినట్టు వెల్లడించారు.



## షిర్డీ సాయిబాబా ప్రసాదాలయం నిబంధనలలో కీలక మార్పులు

**బలగం టీవి, న్యూఢిల్లీ**

షిర్డీ సాయిబాబా ప్రసాదాలయం నిబంధనలలో కీలక మార్పులు చేసింది సాయిబాబా సంస్థాన్. మద్యపానం, ధూమపానం, నేర ప్రవృత్తి ఉన్నవారిని అరికట్టేందుకు ప్రసాదాలయంలో టోకెన్ వ్యవస్థను అమలు చేయాలని నిర్ణయించింది. సాయి దర్శనం తర్వాత ఉచిత భోజన టోకెన్లను అందించడానికి ఏర్పాట్లు చేసింది. గురువారం(ఫిబ్రవరి 6) ఈ నిబంధన అమల్లోకి వచ్చింది. ఇప్పుడు టోకెన్ లేకుండా భక్తులు ప్రసాదాలయంలోని ప్రవేశించలేరని సాయి సంస్థాన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గోరక్ష్ గాడిల్కర్ తెలిపారు.షిర్డీలోని సాయి బాబా సంస్థాన్ ఆధ్వర్యంలో నడిచే భోజనశాలలో రోజుకు సగటున యాభై వేల మంది భక్తులు ఉచిత సాయి ప్రసాదాన్ని తింటున్నారని చెప్పారు గోరక్ష్ గాడిల్కర్. అదే సమయంలో నేర ప్రవృత్తి ఉన్నవారు, డ్రగ్స్ బానిసలు, ధూమపానం చేసేవారు కూడా భోజనశాలలోకి ప్రవేశించి తింటున్నారని ఫిర్యాదులు అందుతున్నాయని వెల్లడించారు. అందుకే అలాంటివారు భోజనశాలలోకి ప్రవేశించకుండా ఉండేందుకు సాయిబాబా సంస్థాన్ కొన్ని ఆంక్షలు విధించిందని తెలిపారు.

"సాయిబాబా దర్శనం అనంతరం బయటకు వచ్చే భక్తులకు సాయి ప్రసాదాలయంలో ఉచిత భోజన టోకెన్‌తో పాటు విభూది, బూందీ ప్రసాదాన్ని అందిస్తాం. ఒకవేళ దర్శనానికి ముందే భోజనం చేయాలనుకునే భక్తులకు ప్రసాదాలయంలో ఉచితంగా టోకెన్లు అందజేస్తాం. సాయి సంస్థాన్ ఆధ్వర్యంలో నడిచే రెండు ఆస్పత్రుల రోగులు, వారి కుటుంబీకులకు వసతి ఏర్పాట్లు చేస్తాం. అలాగే ఉచిత భోజన టోకెన్లు కూడా ఇస్తాం. శిర్డీకి వచ్చే ఏ భక్తుడూ ఆకలితో ఉండరు." అని సాయి సంస్థాన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గోరక్ష్ గాడిల్కర్ పేర్కొన్నారు.

## ఛత్తీస్‌గడ్‌లో మరో ఎన్‌కౌంటర్

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఛత్తీస్‌గడ్‌లోని నారాయణపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలకు మావోయిస్టులకు జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. పలువురు గాయపడినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో భారీగా ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఉదయం నుంచి మాధ్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కాగా.. భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా భారీ ఎత్తున వరుసగా ఎన్‌కౌంటర్లు చేస్తున్నారు. గత ఐదురోజుల క్రితం బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది మావోయిస్టుల మృతి చెందినట్లు పోలీసు వర్గాలు ధృవీకరించాయి.

## యూజీసీ నిబంధనలతో విద్యార్థులకు నష్టం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవి, న్యూఢిల్లీ**

యూజీసీ నిబంధనల పేరుతో రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నేతల బృందం ఢిల్లీలో కేంద్రమంత్రులను కలిసింది. యూజీసీ ముసాయిదా నిబంధనలపై కేంద్రానికి బీఆర్ఎస్ నేతలు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వినతిపత్రం సమర్పించింది. ఆ తర్వాత 365బీ జాతీయ రహదారిని సూర్యాపేట–సిరిసిల్ల రహదారిని కోరుట్ల వరకు విస్తరించాలంటూ నితిన్ గడ్కరీని కోరింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. యూజీసీ నిబంధనల పేరుతో రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారని ఆరోపించారు. నూతన నిబంధనలతో విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. మా అభిప్రాయాలు తెలియజేసేందుకు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసినట్లు తెలిపారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో వీసీల నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీల బాధ్యతను రాష్ట్ర గవర్నర్ల ద్వారా కేంద్రం నియంత్రించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. సెర్చ్ కమిటీల బాధ్యతలను గవర్నర్‌కు అప్పగించేలా నిబంధనలు రూపొందించారన్నారు. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా వ్యవహరిస్తూ.. కొత్త నిబంధనలు రూపొందించారని.. గవర్నర్ల ద్వారా వర్సిటీలను కేంద్రం తమ ఆధీనంలోకి తీసుకోవాలని అనుకుంటుందని ఆరోపించారు. నూతన నిబంధనలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. యూజీసీ నిబంధనలపై అభ్యంతరాలను ఆరు పేజీలతో నివేదిక కేంద్రమంత్రికి ఇచ్చినట్లు వివరించారు. నిబంధనలను సవరించాలని మంత్రిని కోరామన్నారు. ఇలా సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయం తీసుకోవద్దని చెప్పామన్నారు. అలాగే, జాతీయ రహదారి 365బీని పొడిగించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరామన్నారు. ఇక పార్టీ పిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు పడాల్సిందేనన్నారు. అనర్హత వేటు పిటిషన్లపై న్యాయవాదులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు.

## సీఎం రేవంత్‌తో జగ్గీ వాసుదేవ్ భేటీ

**బలగం టీవీ, హైదరాబాద్**



హైదరాబాద్ ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్ నివాసంలో సద్గురు కలిసిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి శాలువతో సద్గురును సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. వారిద్దరు దాదాపు 30 నిమిషాలు సమావేశం అయ్యారు. తమ ఫౌండేషన్ చేపట్టనున్న కార్యక్రమాలకు రేవంత్ రెడ్డిని సద్గురు ఆహ్వానించారు.

## ఏఆర్ఎస్ఐ ఆత్మహత్య

**బలగం టీవీ, ములుగు**

కుటుంబ కలహాలతో ఏఆర్ఎస్ఐ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాది కొత్తగూడెం జిల్లా బయ్యారంలో ఏఆర్ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న నర్సయ్య గురువారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య సునీత ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. భార్యాభర్తల మధ్య నెలకొన్న గొడవల కారణంగానే నర్సయ్య ఆత్మహత్య చేసుకున్నాడని అతని బంధువులు ఆరోపిస్తున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## స్కూల్ బస్సు కిందపడి చిన్నారి మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**



రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్‌పేట విషాదం చోటుచేసుకుంది. హాయత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద అంబర్ పేట హనుమాన్ హిల్స్ లో నివాసం ఉంటున్న బొబ్బిలోగామ రిత్విక(4) పెద్ద అంబర్ పేటలోనే ఉన్న శ్రీ చైతన్య స్కూల్‌లో ఎల్‌కేజీ చదువుతున్నది. చిన్నారి ప్రతి రోజూ లాగే గురువారం సాయంత్రం స్కూల్ ముగియగానే ప్రయివేటు ఓమ్నీ వ్యాన్‌లో ఇంటి వద్దకు చేరుకుంది. వ్యాన్ దిగి చిన్నారి వెళ్తుండగా ఆ వ్యాన్ డ్రైవర్ గణేష్ అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడపడంతో వ్యాన్ ముందు టైరు బాలిక తలపై నుంచి వెళ్లింది. దాంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

## గ్రామసభలో పురుగులు మందుతాగిన వ్యక్తి మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల జాబితాలో తన పేరు రాలేదని గ్రామసభలోనే పురుగుల మందు తాగిన రైతు నాగేశ్వరరావు మృతిచెందారు. పది రోజులకు పైగా ఎంజీఎం ఆస్పత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడిన ఆయన బుధవారం రాత్రి కన్నుమూశారు. వివరాల్లోకెళ్తే.. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామంలో గత నెల 23వ తేదీన గ్రామసభ నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రామసభలో అధికారులు అర్హుల జాబితాను చదివి వినిపించారు. దీంతో కొత్తూరుకు చెందిన కుమ్మరి నాగేశ్వరరావు అనే దళితుడు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరు రాలేదని అధికారులను నిలదీశాడు. వారు పొంతనలేని సమాధానం చెప్పి తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో అన్ని అర్హతలూ ఉన్న తన పేరును జాబితాలో లేకుండా చేశారని ఆవేదన వ్యక్తంచేశాడు. ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా పథకాల్లో అర్హులు కాకుండా అనర్హుల పేర్లు వచ్చాయని, ఒకే కుటుంబంలో ఇద్దరికి ఎలా వస్తాయని ప్రశ్నించాడు. గత ఏడాది తన ఇల్లు కాలిపోయిందని ఫొటోలను అధికారులకు చూపెడుతూనే 'నాకు రాకపోయినా నా చావుతోనైనా గ్రామంలోని అర్హులకు పథకాలు ఇవ్వాలి' అని అధికారులకు చెప్పి తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. గమనించిన గ్రామస్తులు మందు డబ్బాను లాక్కోగా, అక్కడే ఉన్న తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో వనిత వాసనకు ముక్కు మూసుకొని పక్కవెళ్లిపోయారు. అక్కడే ఉన్న ఇతర అధికారులు, గ్రామస్తులు నాగయ్యను అంబులెన్సులో ఏటూరునాగారం సీఎచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ములుగు ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం రాత్రి కన్నుమూశాడు.

## భారత వలసదారుల తరలింపుపై స్పందించిన అమెరికా

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్ దేశానికి చెందిన 104 మంది అక్రమ వలసదారులతో అమెరికా నుంచి బయలుదేరిన యూఎస్ ఎయిర్ ఫోర్స్ విమానం సీ-17 బుధవారం అమృత్ సర్ కు చేరుకున్న సంగతి తెలిసిందే. మరోవైపు వలసదారులకు క్రిమినల్స్ మాదిరి సంకెళ్లు వేసి తరలించారనే వార్తలు కలకలం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ అంశంపై అమెరికా స్పందించింది. ఢిల్లీలోని యూఎస్ దౌత్య కార్యాలయ ప్రతినిధి మాట్లాడుతూ... తమ దేశం, ప్రజల భద్రత కోసం ఇమ్మిగ్రేషన్ చట్టాలను కఠినంగా అమలు చేయడం అత్యవసరమని చెప్పారు. అది తమ దేశ విధానమని అన్నారు. విమానంలో వలసదారుల ప్రయాణం గురించి ఇంతకు మించి ఏమీ మాట్లాడలేమని చెప్పారు. మరోవైపు, ఈ అంశంపై భారత విదేశాంగ మంత్రి జైశంకర్ పార్లమెంట్ లో ప్రకటన చేశారు. అమెరికాలో ఏళ్ల నుంచి అక్రమ వలసదారుల తరలింపు ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. అన్ని దేశాల అక్రమ వలసదారులను అమెరికా డిపోర్ట్ చేస్తోందని అన్నారు. 2012లో ఈ సంఖ్య 530గా ఉందని... ఇప్పుడు 2 వేలకు పైగా ఉందని చెప్పారు.

# బీసీ కులగణన సర్వే విజయవంతం

- **మంత్రి కొండా సురేఖ**
- **కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఏఐసిసి అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి వేర్వేరుగా లేఖలు**

**బలగం టీవీ, హైదరాబాద్**

సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంబీసీ కులగణనను విజయవంతంగా చేపట్టిందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఇదే విషయాన్ని తెలియచేస్తూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఏఐసిసి అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం వేర్వేరుగా లేఖలను రాశారు. రాష్ట్రంలో బీసీల హక్కులను పరిరక్షించేందుకు, వారికి మరింత న్యాయం జరిగేలా ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి తన అభిప్రాయాన్ని ఈ లేఖలో వ్యక్తం చేశారు.

బిసి కులగణనను కార్యరూపంలోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ, కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కీలకంగా పనిచేశారని మంత్రి కొండా సురేఖ ఆ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కట్టుబడి ఉందని, కామారెడ్డి డిక్లరేషన్‌లో పొందుపరిచిన ప్రకటనల ప్రకారం ఈ బిసి సర్వేను విజయవంతంగా అమలు చేయడం ఇందుకు నిదర్శనమని మంత్రి కొండా తెలిపారు.

కాంగ్రెస్ జాతీయ నాయకత్వం ఈ మొత్తం ప్రక్రియలో ప్రభుత్వానికి పూర్తి మద్దతుగా నిలిచిందని, పార్టీ అధినేతలు అందించిన సహాయ, సహకారంతోనే ఈ భారీ సర్వే చేపట్టగలిగామని కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. బిసిలకు ఈ సర్వే ద్వారా మరింత న్యాయం చేయడానికి అవకాశం లభిస్తుందని, వారి సంక్షేమానికి ఇది ఓ కీలక ముందడుగుగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యకు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ జాతీయ నాయకత్వానికి మంత్రి కొండా సురేఖ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సర్వే విజయవంతం చేయడంలో సహకరించిన ఏఐసిసి అగ్రనేతలకు వేర్వేరుగా లేఖలు రాశారు. రాష్ట్రంలో బిసి సంక్షేమానికి కాంగ్రెస్ తీసుకుంటున్న ఈ చర్యలు బలమైన ప్రజాస్వామ్య విలువలకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొంటూ, భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ చర్యలు చేపడుతామని మంత్రి కొండా స్పష్టం చేశారు. ఈ మేరకు జాతీయ నాయకత్వానికి మంత్రి కొండా సురేఖ వేర్వేరుగా లేఖలు రాశారు.

## గోదారిని ఏడారి చేశారు

- **బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత**

**బలగం టీవీ, హైదరాబాద్**



వేసవి రాకముందే గోదారిని ఏడారి చేశారంటూ రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కక్షలో భాగంగా సజీవజలధారను వట్టిబోయేలా చేశారంటూ విమర్శించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ సర్కార్ వహిస్తున్న నిర్లక్ష్యంపై మండిపడ్డారు. మేడిగడ్డ నుంచి ధర్మపురి వరకు వంద కి.మీ. పొడవునా గోదావరిని బిఆర్ఎస్ ప్రభుత్వం సజీవ జలధారగా మార్చిందని గుర్తు చేశారు. మండే ఎండాకాలంలోనూ నిండు కుండలా కలకళలాడేలా చేసిందన్నారు. కానీ కెసిఆర్‌పై కక్షతో కాళేశ్వరం బ్యారేజీలను కాంగ్రెస్ సర్కారు ఎండబెట్టిందని మండిపడ్డారు. 2014కు ముందులా ఫిబ్రవరిలోనే గోదావరి పట్టిపోయి ఎడారిని తలపిస్తోందని పేర్కొన్నారు. ఇప్పుడే ఇట్లా ఉంటే.. ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఇంకెంత దారుణంగా మారుతుందోనని ఆవేదన వ్యక్తం చేశారు. తలాపునే గోదావరి ఉన్నా, గుక్కెడు నీటి కోసం మళ్లీ అరిగోస పడే రోజులను కాంగ్రెస్ ప్రభుత్వం 'గ్యారెంటీ'గా తెచ్చిందని విమర్శించారు. కెసిఆర్ హయాంలో నిండుకుండలా నీటితో కళకళలాడిన గోదావరి నది.. వేసవి రాకముందే ఎడారిని తలపిస్తోందని అన్నారు. సుందిళ్ల బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో గతంలో పెద్దపల్లి జిల్లా గోదావరిఖని కోల్ బెల్ట్ బ్రిడ్జి వద్ద నిండుగా నీళ్లు ఉండేవి అని పేర్కొన్నారు.

## కులగణన సర్వే నివేదికలో లోపాలు

- **బీసీ ఉద్యమ నేత, ఎంపీ ఆర్.కృష్ణయ్య**

**బలగం టీవీ, హైదరాబాద్**



రాష్ట్రంలో కులగణన సర్వేపై బీసీ ఉద్యమ నేత, ఎంపీ ఆర్.కృష్ణయ్య స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే నివేదికలో చాలా లోపాలు ఉన్నాయని ఆరోపించారు. అనేక కుటుంబాలు ఈ సర్వేలో పాల్గొనలేదని అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వ్యూహాత్మకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. కొందరు బీసీ నేతలతో తనను తిట్టించుకుని దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించకపోతే ప్రభుత్వంపై ఉద్యమిస్తామని అనాశ్రీనరు. రిజర్వేషన్లు కల్పించకుంటే సంకుల సమరమే అంటూ హెచ్చరించారు.

రేవంత్ సర్కార్ బీసీలను అణిచివేసేందుకు కుట్రలు పన్నిందని ఆర్ కృష్ణయ్య మండిపడ్డారు. బీసీ జనాభాను తక్కువ చేసి చూపించి అన్ని రంగాల్లో, రిజర్వేషన్లలో అవకాశాలు రాకుండా అడ్డుకునేలా చేస్తున్నారన్నారు. బీసీ వ్యతిరేకిగా సీఎం రేవంత్ రెడ్డి మారారన్నారు. కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా కులగణనలో బీసీల శాతాన్ని తగ్గించి చూపించారని.. ఇది బీసీలను రాజకీయంగా అణిచివేసే కుట్ర అని ఆరోపించారు. ఇప్పటికైనా బీసీ వ్యతిరేక విధానాలకు మార్చుకోకపోతే రాష్ట్రం రణరంగం అవుతుందని హెచ్చరించారు.ఎ ంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లకు చట్ట బద్ధత కల్పించకపోతే ప్రభుత్వంపై ఉద్యమిస్తానని తెలిపారు.

## ఘోర రోడ్డు ప్రమాదం.. ఎనిమిది మంది మృతి

**బలగం టీవీ, జైపూర్**

రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. డూడులోని ఎన్‌హెచ్ 48లోని మోఖంపుర సమీపంలో బస్సు టైర్ పేలడంతో అదుపుతప్పి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న 8 మంది మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరో ఆరుగురికి పైగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. బస్సు జైపూర్ నుండి అజ్మీర్ కు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. కారులో ఉన్న వారందరూ భిల్వారా నివాసితులుగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల సెంటర్లలో సీసీ కెమెరాలు

- **ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో తెలంగాణ ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించే సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 417 కాలేజీల్లో సీసీ కెమెరాలను అద్దెకు తీసుకున్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. మరోవైపు పరీక్షా కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 90 శాతం కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని కృష్ణ ఆదిత్య తెలిపారు. పరీక్ష సమయంలో పేపర్ ఓపెనింగ్ రూమ్, సెంటర్ ఎంట్రన్స్, కారిడార్, గ్రౌండ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. అయితే కొన్ని కార్పొరేట్ కాలేజీలు సీసీ కెమెరాల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నాయని.. ఆ కాలేజీలకు పరీక్షా కేంద్రాలు ఇవ్వడం లేదని స్పష్టం చేశారు.

## జన్మత: పౌరసత్వం రద్దు ఉత్తర్వుల అమలుపై స్టే

**బలగం టీవీ, హైదరాబాద్**

జన్మత: పౌరసత్వం లభించడాన్ని రద్దు చేస్తూ అధ్యక్షుడు ట్రంప్ జారీ చేసిన ఆదేశాల అమలును నిలుపుచేస్తూ ఫెడరల్ జడ్జి ఒకరు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. పౌరసత్వం అనేది అత్యంత విలువైన హక్కని వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలోని 14వ సవరణకు ట్రంప్ ప్రభుత్వం చెప్పిన భాష్యాన్ని ఈ దేశంలోనిఏ న్యాయస్థానం కూడా ధృవీకరించడం లేదని డిస్ట్రిక్ట్ జడ్జి దెబరా బోర్డ్‌మన్ చెప్పారు. ఈ తరహా ఆదేశాలు జారీ చేసిన మొదటి కోర్టు ఇది కాదన్నారు.

# పిల్లలు ప్రభుత్వ బడిలోనే చదవాలి

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**
**-చీర్లవంచలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ**
**-తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ**



**బలగం టీవీ ,తంగళ్లపల్లి**

గ్రామంలోని పిల్లలు ప్రభుత్వ బడిలోనే చదివేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. తంగళ్లపల్లి మండలం చీర్లవంచ పరిధి తెనుగువారిపల్లె లోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, గ్రామంలోని రోడ్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం తరగతి గదులు, మధ్యాహ్నం భోజనం సిద్ధం చేస్తుండగా పరిశీలించారు.

విద్యార్థులతో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. వాటర్ ప్యూరిఫైర్, ఫ్యాన్లు మరమ్మతులు చేయించి, అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.కిచెన్ షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. గ్రామంలోని పిల్లలందరూ ఇదే పాఠశాలలో చదివేలా చూడాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన, సాంకేతికతతో కూడిన బోధనపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.విద్యార్థులు చదువులో రాణించేలా క్రమశిక్షణతో కూడిన భోధన అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కార్తిలాల్ తదితరులు పాల్గొన్నారు.

**70శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరగాలి**

ప్రభుత్వ వైద్యశాలల్లోనే 70 శాతం ప్రసవాలయ్యేలా చూడాలని వైద్యులు, సిబ్బందిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. తంగళ్ళపల్లి లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీ.హెచ్.సీ) కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీ.హెచ్.సీ ఆవరణలో గడ్డి, నిరుపయోగ మొక్కలు పెరగడంతో వాటిని తొలగించాలని ఎం.పీ.ఓ.ను ఆదేశించారు. పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. సీసీ కెమెరాలకు మరమ్మత్తు చేయించి, వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు.అనంతరం పీ.హెచ్.సీ లోని ఓ.పి. ఇతర రిజిస్టర్ లను తనిఖీ చేశారు.ల్యాబ్, ఫార్మసీ ఆయా గదులను పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ దవాఖానల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై గర్భిణీలకు అవగాహన కల్పించాలని 70 శాతానికి పైగా ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరిగేలా చూడాలని ఆదేశించారు. ఏ.ఎన్.ఎం ఆశా కార్యకర్తలతో నిత్యం సమావేశం ఏర్పాటు చేస్తూ ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో డాక్టర్ చంద్రికారెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే పట్టభద్రుల సమస్యలు పరిష్కారం



**- ప్రశ్నించే గొంతుకలు కాదు పరిష్కరించే నాయకులు కావాలి..**
**- ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి..**

**బలగం టీవీ , సిరిసిల్ల**

కాంగ్రెస్ పార్టీతోనే ఉద్యోగ నిరుద్యోగ పట్టబద్రుల సమస్యలు పరిష్కారం అవుతాయని కరీంనగర్ అదిలాబాద్- నిజామాబాద్- మెదక్ పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి వూటుకూరి నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కళాశాల మైదానం , బతుకమ్మ ఘాట్, కార్గిల్ లేక్, ఇంద్ర పార్క్, రాజీవ్ నగర్ స్టేడియం లో వాకర్స్ తో ముఖాముఖి ఈసందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పట్టబద్రుల ఎమ్మెల్యే ప్రచారంలో భాగంగా తాను ఉమ్మడి నాలుగు జిల్లాలలో పర్యటించడం జరిగిందనిచాలా సమస్యలు తన దృష్టికి వచ్చాయని తన పర్యటనలో వచ్చిన సమస్యలు ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటన్నిటి పరిష్కరిస్తానని అన్నారు.పట్టభద్రులకు ప్రశ్నించే గొంతులు అవసరం లేదని సమస్యలు పరిష్కరించే సత్తా ఉన్న నాయకులు కావాలని వెల్లడించారు... విద్యారంగ సమస్యలపై అవగాహన ఉన్న తనకు రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని ప్రభుత్వం చేసే అభివృద్ధి సంక్షేమ పథకాలను యువత ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు . కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన యేడాది కాలంలోనే నిరుద్యోగ యువతకు 55 వేల ఉద్యోగాలు ఇచ్చి వారికి భరోసా కల్పించారని.. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన జాబ్ క్యాలెండర్ అమలుకు తాను కృషి చేస్తానని పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో డిగ్రీ యాజమాన్య కళాశాల ప్రతినిధి ఊటుకూరు రవీందర్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా వీఎన్నార్ టీం ఇంచార్జ్ మాసం రత్నాకర్ పటేల్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం నర్సయ్య, సంగీతం శ్రీనివాస్, గోలి వెంకటరమణ, వేల్పుల తిరుపతిరెడ్డి, వివిఎన్ఆర్ టీం సభ్యులు సభ్యులు ఆనందం, కనపర్తి జగదీశ్వర్, తోపుల శ్రీనివాస్, సుద్దాల శ్రీనివాస్, రాజు, మల్లేశం, మడుపు ప్రవీణ్ రెడ్డి, యేసు రత్నం, గోనె ఎల్లప్ప, కల్లూరు చందన తదితర నాయకులు పాల్గొన్నారు.

# వర్గీకరణ అమలుకు వ్యతిరేకంగా అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన

**ఫిబ్రవరి 4 మాలలకు చీకటి రోజు :**
**జిల్లా కోకన్వీనర్ జక్కుల యాదగిరి**



**బలగం టీవీ , తంగళ్ళపల్లి**

ఏబిసిడి వర్గీకరణలో మాలలకు అన్యాయం జరిగిందంటూ మండలంలోని అంబేద్కర్ ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి జిల్లా మల మహానాడు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాలల ఉప కులాలు 26 ఉంటే ఐదు శాతం రిజర్వేషన్ కేటాయించారని, మాదిగలకు 18 శాతం ఉపకులాలు ఉంటే తొమ్మిది శాతం రిజర్వేషన్లు కేటాయించి మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందంటు, శమిహక్తార్ కమిషన్ కమిటీ నివేదిక ద్వారా ఒక చెల్లని నివేదిక అని గతంలోని 2014లో సుప్రీంకోర్టు ఏబిసిడి వర్గీకరణను కొట్టివేసిందని ఆర్టికల్ 341 ప్రకారం న్యాయం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ వర్గీకరణ చేసే అధికారం లేదని ఈనెల 4 మాలలకు చీకటి రోజు దినోత్సవంగా జరుపుకుంటామని డిమాండ్ చేస్తూ రానున్న ఎన్నికల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐక్యవేదిక కో కన్వీనర్ జక్కుల యాదగిరి, బొల్లం గణేష్, తంగళ్ళపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు గట్టపల్లి పరశురాములు, ఉపాధ్యక్షులు లింగం శ్రీనివాస్, జాతీయ మాల మహానాడు జిల్లా కన్వీనర్ నేరటి శ్రీనివాస్, సిరిగిరి మురళి,ఆనందం, బండరాజు తదితరులు పాల్గొన్నారు.




# రాజన్న సేవలో 'జబర్దస్త్' నటులు..

**బలగం టీవీ , వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని గురువారం జబర్ధస్త్ నటులు సుడిగాలి సుదీర్, ఆటో రామ్ ప్రసాద్ లు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు వారిని ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాన్ని చిత్రపటాన్ని అందజేశారు.

## శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వరదవెల్లిలో (శ్రీ రాజరాజేశ్వర మధ్య మానేర్ జలాశయం) స్వయంభుగా వెలసిన శ్రీ దత్తాత్రేయ స్వామిని గురువారం రోజున బోటులో వెళ్లి జబర్దస్త్ టీం సభ్యులు దర్శించుకున్నారు. టీం సభ్యులు సుడిగాలి సుదీర్, ఆటో రాంప్రసాద్ లు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీళ్ల మధ్యలో గుట్టపై స్వయం భుగా వెలిసిన శ్రీ దత్తాత్రేయ స్వామిని దర్శించుకు న్నందుకు తమకు చాలా ఆనందంగా ఉందని వారు అన్నారు. అనంతరం ఆలయ కమిటీ సంయుక్త కార్యదర్శి నాగుల సాంబయ్య ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు.

# బాధిత కుటుంబానికి రూ. 2 లక్షల ఆర్థిక సాయం



**బలగం టీవీ , సిరిసిల్ల**

తంగళ్ళపల్లి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన దాసరి రమేష్ కు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆర్థిక సాయం అందజేశారు. నేరెళ్ల గ్రామానికి చెందిన దాసరి రమేష్ లలిత దంపతుల పాప బుధవారం ప్రమాదవశాత్తు మరణించగా బాధిత కుటుంబానికి బుధవారం రాత్రి తక్షణ సహాయం కింద రూ. లక్ష అందజేశారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం రూ. మరో లక్ష రూపాయల చెక్కును అందజేశారు.



# ఆర్థిక సహాయం అందజేత

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండలం మాజీ బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షులు చిలుక రఘువర్మ బుధవారం రాత్రి మృతి చెందడంతో పార్టీ సీనియర్ నాయకులు బొల్లి రామ్మోహన్ తక్షణ సాయంగా పదివేల రూపాయల ఆర్థిక సాయంగా బాధిత కుటుంబానికి అందజేశారు. రఘు వర్మ 2009 నుంచి బీఆర్ఎస్ పార్టీకి ఎనలేని సేవలు చేశారని గుర్తు చేశారు. ఇట్టి విషయాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి తెలపడంతో పార్టీ వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. గజాబింకర్ రాజన్న,కోడి అంతయ్య,బండి జగన్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# రిటైర్మెంట్ ప్రకటించిన ఆల్‌రౌండర్ స్టోయినీస్



**బలగం టీవి, హైదరాబాద్**

ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్ మార్కస్ స్టోయినిస్ అంతర్జాతీయ వన్డేలకు విడ్కోలు పలికాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి 15 మంది సభ్యులతో ఆసీస్ జట్టులో చోటు అతనికి చోటు దక్కింది. అయితే అనుహ్యంగా ఆయన రిటైర్మెంట్ ప్రకటించడం అందరినీ విస్మయానికి గురిచేసింది.

"ఆస్ట్రేలియాకు అత్యుత్తున్నత స్ధాయిలో ప్రాతినిథ్యం వహించడం నాకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నాను. ముఖ్యంగా వన్డేల్లో ఆస్ట్రేలియాకు ఆడిన ప్రతీ క్షణాన్ని నేను అస్వాదించాను. ఈ రోజు వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించాలని నిర్ణయించుకున్నాను. ఇది అంత ఈజీగా తీసుకున్న నిర్ణయం కాదు. కానీ నా కెరీర్‌లోని తదుపరి అధ్యాయంపై దృష్టి సారించేందుకు సరైన సమయంగా భావిస్తున్నాను. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను. మా కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్‌తో ప్రత్యేకమైన అనుబంధం ఉంది. అతడు నాకు ఎంతో మద్దతిచ్చాడు. నాకు సపోర్ట్‌గా నిలిచిన క్రికెట్ ఆస్ట్రేలియా, నా సహచరులు, అభిమానులందరికి ధన్యవాదాలు" అని తన రిటైర్మెంట్ ప్రకటనలో స్టోయినిస్ పేర్కొన్నాడు. ఇప్పటివరకు 71 వన్డేలు ఆడిన మార్కస్ స్టోయినిస్.. 1495 పరుగులు చేశాడు. ఇందులో ఓ సెంచరీ, 6 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. బౌలింగ్‌లో 48 వికెట్లు తీశాడు. గత కొనేళ్లగా వైట్ బాల్ ఫార్మాట్‌లో ఆస్ట్రేలియా జట్టులో స్టోయినిస్ కీలక సభ్యునిగా కొనసాగుతున్నాడు. 2023 వన్డే ప్రపంచకప్ గెలిచిన ఆసీస్ జట్టులో కూడా అతడు సభ్యునిగా ఉన్నాడు. అయితే టీ20 క్రికెట్‌పై దృష్టి సారించేందుకు 35 ఏళ్ల ఆల్‌రౌండర్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. స్టోయినిస్ ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పలు ఫ్రాంచైజీ క్రికెట్ లీగ్‌లలో ఆడుతున్నాడు. స్టోయినిస్ చివరగా ఆస్ట్రేలియా తరపున చివరి వన్డే మ్యాచ్ పాకిస్తాన్‌పై ఆడాడు. ఇక ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గోనే తన జట్టుకు ఆల్‌ది బెస్ట్ చెప్పాడు స్టోయినిస్.

# 'లైలా' ట్రైలర్ విడుదల




**బలగం టీవి, హైదరాబాద్**

నటుడు విశ్వక్ సేన్ హీరోగా షైన్ స్క్రీన్స్ నిర్మాణంలో రామ్ నారాయణ్ దర్శకత్వంలో 'లైలా' సినిమా తెరకెక్కుతుంది. ఈ సినిమాలో విశ్వక్ లేడీ గెటప్ లో కనిపించబోతున్నాడు. ఈ సినిమాలో ఆకాంక్ష శర్మ హీరోయిన్ గా నటిస్తుంది. ఇప్పటికే లైలా సినిమా నుంచి టీజర్, సాంగ్స్ రిలీజవ్వగా గురువారం ట్రైలర్ రిలీజ్ చేసారు. ట్రైలర్ చూస్తుంటే.. విశ్వక్ సోను మోడల్ అనే పాత్రలో కనిపించబోతున్నాడని తెలుస్తోంది. సోను వల్ల ఏదో సమస్య అవ్వడంతో పోలీసులు ఇతన్ని వెతకడం మొదలుపెడతారు. దీంతో పోలీసులకు దొరక్కూడదు అని లేడీ గెటప్ వేసుకొని తిరుగుతాడు. మరి లేడీ గెటప్ వేసుకున్నాక ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాడో సినిమాలో చూడాలి. లైలా సినిమా ఫిబ్రవరి 14 వాలెంటైన్స్ డే నాడు రిలీజ్ కానుంది. . పూర్తి వినోదాత్మక కథతో వస్తున్నట్టు కనిపిస్తోంది. లేడీ గెటప్ లో విశ్వక్ సేన్ పర్ఫెక్ట్ గా సెట్ అయ్యాడు.

# సెట్స్‌లో కూతురితో రాంచరణ్ సందడి

**బలగం టీవీ, హైదరాబాద్**



నటుడు రాంచరణ్ ఉప్పెన ఫేం బుచ్చి బాబు దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా రామ్ చరణ్ ఈ మూవీ సెట్స్‌లోని ఫొటో విడుదల చేయగా ప్రస్తుతం వైరలవుతోంది. సెట్స్‌లో కూతురు క్లింకారాను ఎత్తుకున్న స్టిల్ షేర్ చేస్తూ.. మై లిటిల్ క్యూట్ గెస్ట్ అంటూ క్యాప్షన్ పెట్టాడు. ఈ లొకేషన్ ఎక్కడనేది పక్కన పెడితే తండ్రీకూతుళ్ల ఫొటోను చూసి ఫుల్ అభిమానులు కుషీ అవుతున్నారు. ఇక ఈ చిత్రంలో బాలీవుడ్ భామ జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆర్‌సీ 16 షూటింగ్‌ను జులై వరకు పూర్తి చేసి.. దసరా లేదా డిసెంబర్ మొదటి వారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు రెడీ అవుతున్నారని తెలిసింది. ఈ మూవీని సుకుమార్ రైటింగ్స్-మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. ఏఆర్ రెహమాన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, మ్యూజిక్ అందిస్తున్నాడు.

# బోణీ కొట్టిన టీమిండియా

- 4 వికెట్ల తేడాతో భారత్ గెలుపు
- రాణించిన గిల్, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్



**బలగం టీవి, హైదరాబాద్**

ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ బోణి కొట్టింది. తొలి వన్డేలో టీమిండియా 4 వికెట్లతో విజయం సాధించింది. ఇంగ్లండ్ నిర్దేశించిన 249 పరుగుల విజయలక్ష్యాన్ని భారత్ 38.4 ఓవర్లలోనే 6 వికెట్లు కోల్పోయి ఛేదించిందిబౌలింగ్‌లో హర్షిత్ రాణా, జడేజా సత్తా చాటగా.. బ్యాటింగ్‌లో శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్ రాణించారు.

ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 47.4 ఓవర్లలో 248 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ జోస్ బట్లర్(67 బంతుల్లో 4 ఫోర్లతో 52), జాకోబ్ బెతెల్(64 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 51) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా(3/26), అరంగేట్ర పేసర్ హర్షిత్ రాణా(3/53) మూడేసి వికెట్లు తీయగా.. షమీ, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ పడగొట్టారు.

అనంతరం భారత్ 38.4 ఓవర్లలో 6 వికెట్లకు 251 పరుగులు చేసి విజయాన్నందుకుంది. శుభ్‌మన్ గిల్(96 బంతుల్లో 14 ఫోర్లతో 87 ), అక్షర్ పటేల్(47 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 52 ) శ్రేయస్ అయ్యర్(36 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 59) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో సకీబ్ మహ్మూద్(2/47), ఆదిల్ రషీద్(2/49) రెండేసి వికెట్లు తీయగా.. జోఫ్రా ఆర్చర్, జాకోబ్ బెతెల్ తలో వికెట్ పడగొట్టారు.

స్వల్ప లక్ష్యఛేధనకు దిగిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్(15), రోహిత్ శర్మ(2) నిరాశపరిచారు. ఆర్చర్ బౌలింగ్‌లో తీవ్రంగా తడబడ్డ యశస్వి జైస్వాల్.. కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. ఆ వెంటనే రోహిత్ శర్మ అనవసర షాట్‌తో వికెట్ పారేసుకున్నాడు. దాంతో భారత్ 19 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్ దూకుడుగా ఆడగా గిల్ ఆచితూచి ఆడాడు. దాంతో భారత్ పవర్ ప్లేలో 2 వికెట్ల నష్టానికి 71 పరుగులు చేసింది.అనంతరం అదే జోరు కొనసాగించిన అయ్యర్ 30 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. గిల్ కూడా బ్యాట్ ఝులిపించడంతో భారత్ 14 ఓవర్లలోనే 100 పరుగులు పూర్తి చేసుకుంది. క్రీజులో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని జాకోబ్ బెతెల్ విడదీసాడు. అయ్యర్‌ను ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 94 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అయ్యర్ ఔటైనా.. క్రీజులోకి వచ్చిన అక్షర్ పటేల్‌తో కలిసి శుభ్‌మన్ గిల్ ఆచితూచి ఆడాడు. ఈ క్రమంలో అతను హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.మరోవైపు అక్షర్ పటేల్ తనదైన షాట్లతో ఇంగ్లండ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 46 బంతుల్లో అతను కూడా హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. భారత్ విజయం లాంఛనమే అన్న పరిస్థితుల్లో అక్షర్ పటేల్‌ను ఆదిల్ రషీద్ క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో నాలుగో వికెట్‌కు నమోదైన 108 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి వచ్చిన కేఎల్ రాహుల్(2) నిరాశపరిచాడు. ఆదిల్ రషీద్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. సెంచరీ చేయాలనే ఆలోచనతో దూకుడుగా ఆడిన శుభ్‌మన్ గిల్ క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. హార్దిక్ పాండ్యా(9నాటౌట్)తో కలిసి జడేజా(12 నాటౌట్) విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.



# ఇక ప్రతి ఏడాది తెలుగు సినిమాకు పుట్టిన రోజు

**బలగం టీవి, హైదరాబాద్**



ఇక తెలుగు సినిమాకు ప్రతి ఏడాది పుట్టిన రోజుగా చేయాలని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్ణయించింది . హైదరాబాద్‌లో గురువారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ సమావేశమైంది. ఫిబ్రవరి 6వ తేదీ తెలుగు సినిమా పుట్టినరోజు కావడంతో గురువారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఫిల్మ్ చాంబర్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇకపై ప్రతి సంవత్సరం నంది అవార్డుల మాదిరి ఛాంబర్ నుంచి అవార్డులు ఇవ్వాలని తెలుగు ఫిల్మ్ చాంబర్ నిర్ణయించింది. ఫిబ్రవరి 6 తెలుగు సినిమా పుట్టిన రోజు వేడుకల్లోనే అవార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. తెలుగు సినిమా పుట్టినరోజున ప్రతి సినిమా నటుడు ఇంటిపై, థియేటర్ల వద్ద ప్రత్యేకంగా జెండా ఆవిష్కరించాలని నిర్ణయం జరిగింది. ఈ జెండా రూపకల్పన బాధ్యతను సీనియర్ రచయిత పరిచూరి గోపాలకృష్ణకు అప్పగించింది ఫిల్మ్ ఛాంబర్. తొలి తెలుగు టాకీ సినిమాకు సంబంధించి వివరాలను ఎంతో రీసెర్చ్ చేసి భక్త ప్రహ్లాద గురించి తెలిపిన సీనియర్ జర్నలిస్ట్ రెంటాల జయదేవ కృషిని గుర్తు చేసుకుంటూ.. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ భరత్ భూషణ్ ఆధ్వర్యంలో ఇదే వేదికపై ఆయన రచించిన 'మన సినిమా ఫస్ట్ రీల్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగింది.

ఇక తెలుగు సినిమా పుట్టిన రోజు సందర్భంగా సీనియర్ రైటర్ పరుచూరు గోపాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఛాంబర్ ప్రెసిడెంట్ దామోదర ప్రసాద్ మాట్లాడుతూ.. "నెక్స్ ఇయర్ నుంచి గ్రాండ్ గా నిర్వహించబోతున్నాం. పాత తరం కళాకారులకు మరిన్ని సన్మానాలు చేస్తాం. సినిమా హిస్టరీ గురించి చెబితే.. సినిమా అనేది ఫస్ట్. బర్త్ ఆఫ్ సినిమా ముఖ్యం. చాలామంది ఎన్నో చరిత్రలు క్రియేట్ చేశారు. కానీ బర్త్ ఆఫ్ సినిమా అనేది ముఖ్యం. రాబోయే తరాలు కూడా ఇది గుర్తుంచుకోవాలి. ఇక ఈ రోజును గురించి పాతికేళ్ల పాటు రీసెర్చ్ చేసి మొదటి తెలుగు టాకీ సినిమా డేట్ ను ఖచ్చితంగా గుర్తించి ప్రపంచానికి తెలియజేసిన సీనియర్ జర్నలిస్ట్ రెంటాల జయదేవ్ గారికి థ్యాంక్స్ చెబుతున్నాను " అన్నారు. తెలుగు భాషలో భక్త ప్రహ్లాద మొట్టమొదట విడుదలైన సినిమా రోజును తెలుగు సినిమా పుట్టినరోజుగా చేసుకుంటున్నారు. 6వ తేదీ ఫిబ్రవరి 1932న భక్త ప్రహ్లాద విడుదలైంది. ఈ సందర్భంగా తెలుగు సినిమా సంబరాలు నిర్వహిస్తున్నారు.

సీనియర్ నటులు, నిర్మాత మురళీ మోహన్ మాట్లాడుతూ.. "ఎప్పటి నుంచో చేసుకోవాల్సిన పండగ. ఇప్పటికైనా నిర్వహిస్తున్నందుకు సంతోషం. మనమంతా ఇండస్ట్రీ మీద బ్రతుకుతున్నవాళ్లం. ఒకప్పుడు నాగేశ్వరరావుగారు ఒక మాట అన్నారు. మేం వచ్చినప్పుడు చాలా పెద్ద పోటీ ఉండేది. మాకు సంస్కృతం మాట్లాడటం రాదు.. అప్పుడు వాళ్లు పాటలు కూడా పాడుకున్నారు. మాకు అవేవీ రాకున్నా.. ఎంతో హార్డ్ వర్క్ చేసి తర్వాత తరాలకు ఓ రోడ్ వేశాం. దానిపై మీరంతా హ్యాపీగా వెళుతున్నారు అన్నారు. అది నిజం. అలాంటి మహనీయులు చేసిన కృషే ఇది. మనం గర్వంగా చెప్పుకోదగ్గ వ్యక్తుల్లో ఎల్వీ ప్రసాద్ గారు ఆద్యుడు అని చెప్పాలి. ఆయనతో పాటు ఎందరున్నా.. ఎల్వీ ప్రసాద్ గారు హిందీ, బెంగాలీ చిత్రాల్లోనూ నటించి దర్శకుడుగానూ రాణించి సినిమా స్థాయిని పెంచారు. ఇవాళ రాజకీయ నాయకులకంటే సినిమా వాళ్లకే ప్రజల్లో ఆదరణ ఎక్కువ. క్రీడాకారులకు కూడా ఆదరణ అంతంత మాత్రమే. సినీ నటులు మాత్రం ఎప్పుడు ప్రేక్షకుల హృదయాల్లో ఉంటారు" అని అన్నారు.